(iii) వ్యతిరేక అసమాపక క్రియారూపాలు పూర్వ పదంగా ఉన్నపుడు వాటికి అజాది రూపాలు పరమైతే అసమాపక క్రియారూపాల చివరి అకారం వికల్పంగా లోపిస్తుంది. లోపించిన/లోపించని రూపాలు శ్రీరామాయణం కావ్యభాషలో ఎక్కువగానే కనిపిస్తున్నాయి.

**"అకారం"లోపించిన రూపాలు:**

కాక+ఉన్న=కాకున్న(4:971)
చెడక+ఉండు=చెడకుండు(2:2102)
తప్పక+ఉండ=తప్పకుండ(2:1746)
నడవక+ఉండిన=నడవకుండిన(3:2786)
పొందక+ఉండ=పొందకుండ(2:2199)
పొసఁగక+ఉండిన=పొసఁగకుండిన(4:490)
పోక+ఉండ=పోకుండ(4:5603)
మునుఁగక+ఉండ=మునుఁగకుండ(2:2056)
రాక+ఉండ=రాకుండ(5:158)
రాక+ఉన్న=రాకున్న(4:867)
లేక+ఉండ=లేకుండ(1:1338)

"అకారం"లోపించని రూపాలు:

ఎరుఁగక+ఉన్న=ఎరుఁగకయున్న(1:981)
ఒందక+ఉండు=ఒందకయుండు(3:2717)
కదలక+ఉండు=కదలకయుండు(4:5117)
కానక+ఉన్న=కానకయున్న(2:1245)
తీర్చక+ఉన్న=తీర్చకయున్న(4:5505)
పలుకక+ఉండు=పలుకకయుండు(2:894)
పోవక+ఉన్న=పోవకయున్న(1:3889)
మిన్నక+ఉండు=మిన్నకయుండు(1:3111)
లేక+ఉండు=లేకయుండు(4:490)
వదలక+ఉన్న=వదలకయున్న(4:2385)

**(iv) భూతకాలిక ధాతుజ విశేషణంయొక్క చివరి అకారం వికల్పంగా లోపించిన రూపాలు ఈ కావ్యంలో ఉన్నాయి.**

**లోపించిన రూపాలు:**

ఇచ్చిన+అట్టి=ఇచ్చినట్టి(2:3390)
ఉన్న+అట్టు=ఉన్నట్టు(6:9777)
చూచిన+అట్టులు=చూచినట్టులు(6:12324)
తెచ్చిన+అట్టి=తెచ్చినట్టి(2:10288)

**లోపించని రూపాలు:**

అరిగిన+అంత=అరిగినయంత(1:1679)
ఆడిన+అంత=ఆడినంత(2:3923)
గెల్చిన+అట్టి=గెల్చినయట్టి(6:12039)
పాసిన+అట్టి=పాసినయట్టి(1:499)

## 2.3.1.4 అత్వ సంధి వికల్పతకు అపవాదాలు

(i) స్త్రీ వాచక శబ్దాంత అకారానికి లోపం లేని రూపాలే శ్రీరామాయణంలో కనిపిస్తున్నాయి.

వనిత+ఈసీత=వనితయీసీత(6:911)
వనిత+ఉన్న+ఎడకు=వనితయున్నెడకు(1:3495)

(ii) శ్రేష్ఠతావాచకాలు పరమైనపుడు అచ్చులకు సంధి నిత్యంగా జరిగిన రూపాలు శ్రీరామాయణం కావ్యంలో ప్రయోగించబడ్డాయి.

ఏమి+అమ్మ=ఏమమ్మ(2:2005)
ఏమి+అయ్య=ఏమయ్య(4:2019)

(iii) సముచ్చయార్థక శబ్దాలు పరమైనపుడు హ్రస్వ అకారానికి లోపంలేని రూపాలు శ్రీరామాయణంలో కనిపిస్తున్నాయి.

అంత+ఉన్=అంతయున్(2:378)

ఎంత+ఉన్=ఎంతయున్(1:4946)

(iv) -ఎ/-ఏలు ప్రశ్నార్థక ప్రత్యయాలుగా పరమైనపుడు పూర్వ పదాంత అకారానికి లోపం వచ్చిన రూపాలు శ్రీరామాయణంలో ప్రయోగించబడ్డాయి.

ఉండుట+ఏమిటి=ఉండుటేమిటి?(6:4360)

ఎఱుఁగుట+ఏలాఁగు=ఎఱుఁగుటేలాఁగు?(2:1424)

ఏలుట+ఏడ=ఏలుటేడ?(1:1461)

(v) అచ్చు పరమైనపుడు భావార్థక రూపాలలోని అంత్య అకారానికి లోపం వికల్పంగా వచ్చిన రూపాలు కనిపిస్తున్నాయి.

**భావార్థక రూపాలలోని అంత్య అకారం లోపించిన రూపాలు:**

అరుగుట+ఏ+కాక=అరుగుటేకాక(6:4226)

వెదకించుట+ఏమి=వెదకించుటేమి(5:1478)

**భావార్థక రూపాలలోని అంత్య అకారం లోపించని రూపాలు:**

నగుట+ఏకద=నగుటయేగద(4:778)

మించుట+ఏమి=మించుటయేమి?(2:29)

## 2.3.1.5 ఇత్వసంధి

ఇదంత రూపాలకు అజాది రూపాలు పరమైనపుడు ఇత్వ సంధి జరుగుతుంది. అజాదిరూపం పరమైనపుడు పూర్వ పదాంత ఇకారానికి లోపం కొన్ని చోట్ల నిత్యంగా, కొన్ని చోట్ల వైకల్పికంగా వస్తుంది. మరి కొన్ని తావుల్లో లోపానికి బదులు 'యకారం' ఆగమంగా వస్తుంది.

(i) ఇదంత రూపానికి అజాది రూపం పరమైనపుడు ఇదంత రూపంలోని స్వతస్సిద్ధ ఇకారం వికల్పంగా లోపిస్తుంది. లోపించిన రూపాలు శ్రీరామాయణంలో చాలా తక్కువగా కనిపిస్తున్నాయి.

**స్వతస్సిద్ధ ఇకారం లోపించని రూపాలు:**

అంజలి+ఒనర్చి=అంజలియొనర్చి(1:4379)

అది+ఎట్టులనిన=అదియెట్టులనిన(1:222)

ఇడి+ఇట్లు=ఇడియిట్లు(2:7525)

చేరి+అడ్డము=చేరియడ్డము(3:2134)

జాలి+ఏమిటికి=జాలియేమిటికి(5:1746)

పోయి+అవ్వలికి=పోయియవ్వలికి(1:3132)

భళి+అనుచు=భళియనుచు(1:2344)

మిసిమి+ఆకులు=మిసిమియాకులు(3:4680)

హతి+ఒనర్చె=హతియొనర్చె(1:2562)

**స్వతస్సిద్ధ ఇకారం లోపించిన రూపాలు:**

చిట్టి+అడవి=చిట్టడవి(2:6781)

ఆనతి+ఇమ్మన=ఆనతిమ్మన(6:10875)

(ii) ఏమ్యాదుల ఇత్తునకు సంధి వైకల్పికంగా (బాలవ్యా.సంధి.:5) జరిగిన రూపాలు శ్రీరామాయణంలో కనిపిస్తున్నాయి.

**లోపించిన రూపాలు:**

అది+ఏటి=అదేటి(4:3468)

ఏమి+అంటి=ఏమంటి(2:639)

ఏమి+అని=ఏమని(4:5248)

ఏమి+ఏమి=ఏమేమి(1:167)

**లోపించని రూపాలు:**

అది+ఏమొ=అదియేమొ(2:1048)

ఇది+అని=ఇదియని(4:5186)

ఇది+ఏమి=ఇదియేమి(5:173)

(iii) అజాది రూపం పరమైనపుడు తత్సమ పదాంత ఇత్వం లోపించని రూపాలే శ్రీరామాయణంలో ఉన్నాయి.

బుద్ధి+ఆమీద=బుద్ధియామీద(1:1822)
హరి+ఎక్కడొ=హరియెక్కడొ(1:5621)

(iv) అజాది రూపం పరమైనపుడు వ్యతిరేక ధాతుజ విశేషణం "-అని" లోని చివరి ఇత్వం లోపించిన, లోపించని రూపాలు శ్రీరామాయణంలో ఉన్నాయి.

**లోపించిన రూపాలు:**

ఊరని+అట్టి=ఊరనట్టి(1:1153)
కడతేఱని+అట్టి=కడతేఱనట్టి(6:1950)
చీరని+అట్టి=చీరనట్టి(3:1287)
తగని+అట్టి=తగనట్టి(4:2319)

**లోపించని రూపాలు:**

ఎఱుగని+అట్టి=ఎఱుఁగనియట్టి(2:4026)
దరిలేని+అట్టి=దరిలేనియట్టి(2:780)
రాని+అట్టి=రానియట్టి(2:5056)
లేని+అట్టి=లేనియట్టి(2:9534)

(v) భూతకాల అసమాపక క్రియారూపాలలోని (క్త్వార్థ రూపాలలోని) చివరి ఇత్వం లోపించని రూపాలే శ్రీరామాయణంలో ఉన్నాయి.

అరసి+ఉన్నారె=అరసియున్నారె(2:2018)
కొల్చి+ఉండ=కొల్చియుండ(2:4553)
చేరి+అచ్చటి=చేరియచ్చటి(3:6385)
తెచ్చి+ఉంచుట=తెచ్చియుంచుట(2:5274)

పడి+ఉన్నవాఁడు=పడియున్నవాఁడు(2:2048)
మెచ్చి+ఆముని=మెచ్చియాముని(3:496)
వచ్చి+అతండు=వచ్చియతండు(2:5131)
వచ్చి+ఉన్నాడు=వచ్చియున్నాఁడు(3:317)

(vi) బాలవ్యాకర్త "క్త్వార్థంబైన యిత్తునకు సంధిలేదు" (బాలవ్యా.సంధి.:8)అని సూత్రించి క్త్వార్థ ఇకారానికి సంధి నిషేధించాడు. కానీ హ్రస్వ ఇకారం పరమైనపుడు క్త్వార్థ ఇకారం లోపించిన రూపాలు శ్రీరామాయణంలో కనిపిస్తున్నాయి.

అంది+ఇచ్చి=అందిచ్చి(4:688)
పట్టి+ఇచ్చె=పట్టిచ్చె(6:7388)
వడఁకి+అటునిటు=వడఁకటునిటు(3:2342)

(vii) సమాపక క్రియాంత ఇత్వం లోపించిన రూపాలే శ్రీరామాయణంలో ప్రయోగించబడ్డాయి.

**ఉత్తమ పురుష:**

చేసితిని+అని=చేసితినని (2:5806)
చేసితిమి+ఇట్టుల=చేసితిమిట్టుల(2:1228)
వచ్చితిమి+ఇది=వచ్చితిమిది(2:5441)
వచ్చితిమి+ఏని=వచ్చితిమేని(2:5287)

**మధ్యమ పురుష:**

చూచితివి+ఏ=చూచితివే(3:6459)
చేసితి*+ఈపట్టునకు=చేసితీపట్టునకు(2:1290)
చేసితివి+ఏని=చేసితివేని(4:3674)
పడనేసితివి+ఏని=పడనేసితివేని(4:2430)

---

* మధ్యమ పురుష ఏకవచనప్రత్యయం "వి" లోపించిన రూపం
"బ్రాఁ(ప్రా")పింపఁజేసితీ-పట్టునాకునీవు"

ప్రథమ పురుష:

కలితులైరి+అపుడు=కలితులైరపుడు(6:8815)

కాంచిరి+అపుడు=కాంచిరపుడు(6:8818)

పాఱిరి+అపుడు=పాఱిరపుడు(6:9112)

వచ్చిరి+అపుడు=వచ్చిరపుడు(6:822)

"క్రియాపదంబులం దిత్తునకు సంధి వైకల్పికముగా నగు" మధ్యమ పురుష క్రియలం దిత్తునకు సంధియగును" (బాలవ్యా.సంధి.:6, 7) అని బాలవ్యాకర్త అజాది ప్రత్యయం పరమైనపుడు సమాపక క్రియారూపాల్లోని ఉత్తమ, ప్రథమ పురుషల పదాంత ఇకారం వికల్పంగా లోపిస్తుందనీ, మధ్యమ పురుష పదాంత ఇకారం నిత్యంగా లోపిస్తుందనీ సూత్రించారు. శ్రీరామాయణంలో సమాపక క్రియాంత ఇకారం లోపించిన రూపాలు మాత్రమే కనిపిస్తున్నాయి.

**(viii) పదకల్పాలు(clitics) పరమైనపుడు;**

సముచ్చయార్థక "ఉన్" పరమైనపుడు హ్రస్వ ఇకారం లోపించని రూపాలే ఎక్కువగా శ్రీరామాయణంలో ప్రయోగించబడ్డాయి.

అది+ఉన్=అదియున్(6:108)

ఎఱింగి+ఉన్=ఎఱింగియున్(6:835)

తెలిసి+ఉ=తెలిసియు(1:605)

వెండి+ఉ=వెండియు(4:5616)

పదాంత ఇకారం లోపించిన రూపం శ్రీరామాయణంలో ఒక్కటే ఉంది.

అయి+ఉ=అయ్యు(2:11)

ఈ ప్రయోగం శ్రీరామాయణంలో ఐదుచోట్ల (2:11, 2:6704, 2:9463, 6:29, 6:518) మాత్రమే కనిపిస్తోంది.

(ix) ఏవార్థక ప్రత్యయమైన "-ఎ" పరమైనపుడు ఇత్వం లోపించిన, లోపించని రూపాలు కనబడుతున్నాయి. ప్రశ్నార్థకాలైన "ఆ/ఎ/ఏ"లు పరమైనపుడు ఇత్వం లోపించిన రూపాలే కనబడుతున్నాయి. ఏవార్థక ప్రత్యయాలైన "ఏ/అ"లతో రూపాలు లేవు.

**ఏవార్థకం: /-ఎ/**

**ఇత్వం లోపించిన రూపం:**

ఇది+ఎ=ఇదె(1:4124)

**ఇత్వం లోపించని రూపం:**

ఇది+ఎ=ఇదియె(1:1610)

ఈ రూపం శ్రీరామాయణంలో ఐదుచోట్ల (1:1610, 2:2382, 6:411, 6:11421, 6:11545) ప్రయోగించబడింది.

**ప్రశ్నార్థకాలు: -ఆ/-ఎ/-ఏ**

అంటివి+ఆ=అంటివా?(3:1761)
చేసితివి+ఎ=చేసితివె?(2:9080)
చూచితి+ఏ=చూచితే?(3:5468)

## 2.3.1.6 ఎత్వసంధి

పూర్వ పదాంత్య "ఎకారా"నికి అచ్చు పరంగా ఉన్నపుడు సంధిరాదు.

కలడె+ఒక్కరుడు=కలడెయొక్కరుఁడు(1:4122)
కలదె+అన్యుల=కలదెయన్యుల(2:9704)
కలదె+ఎందైన=కలదెయెందైన(5:1697)
తీగె+ఉయ్యేల=తీగెయుయ్యేల(5:4677)

### 2.3.1.7 దీర్ఘాచ్సంధి:

అజంత రూపం పరమైనపుడు దీర్ఘాచ్చుకు లోపం రాదు. యడాగమం వస్తుంది.

ఎట్లకోయనుచు(3:5949)
చాలడొకోయను(5:2985)
నీయాస(2:1490)
రమ్మాయనిపలుక(1:2518)
రామాయని(2:1981)

## 2.3.2 అచ్చుకు హల్లు పరంకావడం

త్రిక, గసడద వాదేశ సంధులు, కొన్ని సందర్భాల్లో ప్రయోగాల్లో కనిపించే పదాంత హ్రస్వాచ్చుల లోపం ఈ విభాగంలోకి వస్తాయి.

దూరవర్తి సర్వనామాగం (remote demonstrative base) అయిన "ఆ", సమీపవర్తి సర్వనామాంగం (proximate demonastrative base) అయిన "ఈ", ప్రశ్నార్థక సర్వనామాంగం (interrogative base) అయిన "ఏ"లలో "ఆ,ఈ"లు నిర్దేశాత్మకాలు. "ఏ" ప్రశ్నార్థకం. వీటిని బాలవ్యాకర్త "ఆ,ఈ,ఏ అను సర్వనామంబులు త్రికంబునాఁబడు" (బాలవ్యా. సమాస.:4) అనే సూత్రంలో వివరించాడు. వీటికి ఊష్మరేఫలు, అసంయుక్త, ద్విరుక్త హల్లులు పరమైనపుడు జరిగే సంధి విధానాన్ని "త్రికంబుమీఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు" *"ఊష్మరేఫంబులకు ద్విత్వంబు గలుగదు" (బాలవ్యా.సమాస.:14), "ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్చికంబగు దీర్ఘంబునకు హ్రస్వం బగు" (బాలవ్యా.సమాస.:13) అనే సూత్రాల ద్వారా వివరించాడు. వీటికి ఊష్మరేఫేతర అసంయుక్త హల్లులు పరమైనపుడు వికల్పంగా సంధి జరిగిన రూపాలు శ్రీరామాయణంలో గుర్తించటం జరిగింది.

**సంధి జరిగిన రూపాలు:**

ఆ+చోటు=అచ్చోటు(2:9375) (ఏకైకప్ర.)
ఆ+వెలది=అవ్వెలది(4:6012) (ఏకైకప్ర.)

(*వృత్తివచనం)

ఈ+వనంబు=ఇవ్వనంబు(2:5481) (ఏకైకప్ర.)

ఈ+విధంబు=ఇవ్విధంబు(2:2031) (ఏకైకప్ర.)

ఏ+చోట=ఎచ్చోట(5:837)

ఏ+వారి=ఎవ్వారి(4:1752)

**సంధి జరగని రూపాలు:**

ఆపురము(2:5041)
ఆవిధంబు(6:2982)
ఈవిధంబు(4:1800)
ఏవిధంబు(5:2250)

ఊష్మరేఫలు పరమైనపుడు సంధిజరిగిన రూపాలు శ్రీరామాయణంలో లేవు. ఊష్మ రేఫలు పరమైనపుడు సంధి జరగని రూపాలు:

ఆసుమంత్రుఁడు(2:1681)
ఆసురారి(6:3941)
ఆశౌర్యనిధుల(1:4034)
ఈరమణి(3:4737)
ఈరాముఁడు(6:4023)
ఈరీతి(6:1127)

సంధి నివారకమైన యకారం ద్విత్వాన్ని పొందటం కొన్ని రూపాల్లో కనిపిస్తోంది.

ఆ+అన్నము=అయ్యన్నము(1:4668) (ఏకైకప్ర.)

ఈ=ఏరు=ఇయ్యేరు(2:8711)(ఏకైకప్ర.)

ఏ+అవి=ఎయ్యవి(1:3502)

## 2.3.3 గసడదవాదేశసంధి

"ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళముగా నగు" (బాలవ్యా.సంధి.:13) శ్రీరామాయణంలోని గసడదవాదేశ రూపాలలో "పకారానికి" "వకారం" ఆదేశంగా వచ్చిన రూపాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. "టకారానికి" "డకారం" ఆదేశంగా వచ్చిన రూపాలు శ్రీరామాయణంలో

లేవు.

**గసడదవాదేశం వచ్చిన రూపాలు:**

చావ+కొట్టి=చావగొట్టి (6:928)
పగుల+కొట్టి=పగులఁగొట్టి (4:1046)
పట్టము+కట్టి=పట్టముగట్టి(1:5165)
కమ్మరనె+చనియె=కమ్మరనెసనియె(2:879)
కేలు+చాఁచి=కేలుసాఁచి(6:27)
దొర+చెప్పిన=దొరసెప్పిన(4:1780)
కన్నీరు+తుడిచి=కన్నీరుదుడిచి(5:2713)
మనుజులు+తక్క=మనుజులుదక్క(3:2736)
పాదములపై+తలమోపి=పాదములపైదలమోపి(2:2241)
ఇట్లు+పలుక=ఇట్లువలుక(3:5970)
ఎక్కు+పెట్టిన=ఎక్కువెట్టిన(4:357)
చెట్టు+పట్టి=చెట్టువట్టి(3:115)
తల+పట్టి=తలవట్టి(3:644)
బొంకు+పలుకఁడు=బొంకువలుకఁడు(3:1452)

**గసడదవాదేశం రాని రూపాలు:**

లంకయునుకలవారి(6:1814)
అట్టహాసముచేసి(6:5000)
ఆలోచనముచేసి(6:1899)
యోజనచేసి(6:4879)
పనులేలతప్పు(6:529)
పెడతలపెట్టి(5:1959)
మోసపుచ్చుటయు(4:5070)

## 2.3.3.1 గసడదవాదేశ సంధికి అపవాదాలు:

(i) విశేషణాలమీద గసడదవాదేశం రావటం:

నెఱిగొప్పులు(6:10483) (ఏకైకప్ర.)

(ii) ద్వంద్వ సమాసాలలో గసడదవాదేశం రావటం:

అన్నదమ్ములు(6:1311)
తల్లిదండ్రులు(4:2209)

(iii) క్రియాపదాలమీద గసడదవాదేశం రావటం:

అరుదెంచు(5:3721)
చనుదెంచి(6:150)

(iv) క్త్వార్థరూపాలమీద గసడదవాదేశం రావటం:

చెడి+పోయె=చెడివోయె(3:631)
వచ్చి+తావహుతాశనార్చు=వచ్చిదావహుతాశనార్చు(3:1691)

(v) సంఖ్యావాచకాలమీద గసడదవాదేశం రావటం:

ఇరుగడ(6:780)
ఇరుగేల(5:3033)
నలుగడ(4:2919)

(vi) కొన్ని అవ్యయాలమీద గసడదవాదేశం వైకల్పికంగా కనిపిస్తోంది.

| అవ్యయం | గసడదవాదేశంరానిరూపం | గసడదవాదేశరూపం |
|---|---|---|
| ఏమి | ఏమిచేసితి(6:8494) | ఏమిసేయుదు(6:7153) |

ఇంత ఇంతచాలదె (6:5209, 10) ఇంతసేసితి(5:4132)

**(vii) శబ్దపల్లవక్రియలలో గసడదవాదేశం వైకల్పికంగా కనిపిస్తోంది.**

**ఆదేశం వచ్చిన రూపాలు:**

ఏఁగుదెంచి(6:7343)
చనుదెంచి(6:11233)
వెలువడు(2:5826)

**ఆదేశం రానిరూపాలు:**

కొనిపోవు(3:4574)
నిలుచుండి(3:855)
మేలుకొను(1:2082)

**(viii) ఏవార్థకాలమీద గసడదవాదేశం రాదు.**

సుఖియేకదా! (2:9021)

## 2.3.4 అజ్లోపసంధి

"పదాంతంబులయి యసంయుక్తంబులయిన నులురుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు" (బాలవ్యా.ప్రకీర్ణ.:16) అనే సూత్రంచేత బాలవ్యాకర్త పదాంత నులురులలోని హ్రస్వ ఉకారానికి హల్లు పరమైనపుడు లోపం బహుళంగా వస్తుందని తెలియజేశారు. లోపంవచ్చిన రూపాలు *శ్రీరామాయణం*లో కనిపిస్తున్నాయి.

కను+కొనుచు=కన్గొనుచు(2:1551)
మ్రాను+పడి=మ్రాన్పడి(3:5229)
కాలు+నడను=కాల్నడను(2:3566)
కేలు+మోడ్చి=కేల్మోడ్చి(2:5479)
నలు+కడ=నల్గడ(4:1580)
పలు+మారు=పల్మారు(5:2398)